

జిల్లాకేంద్రంలో క్రికెట్ జట్ల ఎంపిక

నిర్మల్‌అర్బన్, ఆగస్టు25: జిల్లాకేంద్రంలోని ప్రత్యేక క్రికెట్ శిక్షణ కేంద్రంలో ఆదివారం టీసీఏ జిల్లాస్థాయి యూ16, యూ19 విభాగాల్లో క్రికెట్ జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేవైఎం నిర్మల్‌జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్ హాజరై మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా జట్టు కోచ్ రామరాజు మాట్లాడుతూ ఎంపికైన జట్టు వచ్చేనెలలో జరిగే అంతర్ జిల్లా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలో పాల్గొంటారని వెల్లడించారు.



- నిధుల కొరతతో పూర్తికాని ప్యాకేజీ 27, 28 హైలెవల్ కాల్వల నిర్మాణ పనులు
- నేటికీ పూర్తికాని భూ సేకరణ
- నెరవేరని లక్ష ఎకరాల ఆయకట్టు సాగునీటి లక్ష్యం
- 14 ఏళ్లుగా తప్పని నిరీక్షణ
- కొత్త సర్కారు చర్యలు చేపట్టాలంటున్న రైతులు



కుంటాల సమీపంలో ప్యాకేజీ 27 కింద చేపట్టిన కాల్వ నిర్మాణ పనులు కూలిపోయి ఉన్న దృశ్యం (ఫైల్)

ముందుకు సాగని కాళేశ్వరం కాల్వల పనులు!



నిర్మల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్ష ఎకరాలకు అదనంగా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో 2009లో చేపట్టిన కాళేశ్వరం ప్యాకేజీ 27, 28 హైలెవల్ కాలువల నిర్మాణాల పనులు నేటికీ పూర్తికాక లక్ష్యం నీరుగారిపోతోంది. నిర్మల్ నియోజకవర్గంలో 50 వేలు, ముథోల్ నియోజకవర్గంలో మరో 50వేలు కలిపి మొత్తం లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ రెండు హైలెవల్ కాలువలు శ్రీరాంసాగర్ ప్రాజె క్టు నీటిపై ఆధారపడి నిర్మిస్తున్నా రు. దాదాపు రూ.1200కోట్ల వ్యయంతో రెండు కాల్వలను నిర్మించేందుకు అప్పట్లో ఈ ప్రతిపాదనలు రూపొందించారు. మొదట ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన ఈ రెండు కాలువల నిర్మాణాలను ఆ తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోకి చేర్చారు. 27వ నంబర్ ప్యాకేజీ హైలెవల్ కెనాల్ నిర్మాణం కోసం రూ.714 కోట్లను అలాగే 28వ నెంబర్ ప్యాకేజీ హైలెవల్ కెనాల్ నిర్మాణం కోసం రూ.486.67 కోట్లను అప్పట్లో ప్రభుత్వం మంజూరుచేసింది. కాగా 27వ నంబర్ ప్యాకేజీ హైలెవల్ కాలువల నిర్మాణ పనులు మొదటి నుంచి వివాదాస్పదమయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించకపోవడం అలాగే భూసేకరణ విషయంలో పరిహారం సకాలంలో అందించకపోవడం, కొత్తగా భూసేకరణకు రైతులు నిరాకరించడం లాంటి సమస్యలు ఈ కాలువ పనులపై ప్రభావం చూపాయి. అయితే నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయకపోవడంతో అలాగే భూ సేకరణకు సంబంధించిన పరిహారం డబ్బులను రైతులకు అందించకపోవడంతో నిర్మాణపనులన్నీ అర్థాంతరంగా నిలిచిపోయాయి. చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ సైతం ఇక పనులు చేయలేమంటూ చేతులెత్తేశారు. జిల్లాకు చెందిన అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితోపాటు నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు సైతం సదరు మొదటి కాంట్రాక్టర్‌ను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. తన యంత్ర సామగ్రినంతా కాంట్రాక్టర్ తరలించుకు వెళ్లారు. అప్పటి ప్రభుత్వం మరో కాంట్రాక్టర్‌ను నియమించింది. పూర్తిగా ఎత్తిపోతల పద్ధతిలో ఎస్సారెస్పీ నుంచి ఈ కాల్వలకు నీరు అందించాలని తలపెట్టారు. దీని కోసం ఇప్పటికే గుండంపెల్లి, దిలావర్‌పూర్ వద్ద పంప్‌హౌజ్‌లను సైతం నిర్మించారు. అలాగే కొంతమేరకు కాలువలను సైతం నిర్మించారు. దీని కోసం మొత్తం రూ.444.42 కోట్లు ఖర్చు చేశారు. అయితే బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం సమస్యగా మారడంతో దాదాపు మూడు నాలుగేళ్ల క్రితమే కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. దీంతో ఇటీవలే మళ్లీ రూ.298.51 కోట్లను మంజూరు చేయడమే కాకుండా పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2024 వరకు ఈ కాలువ పనులన్నింటినీ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ముథోల్ నియోజకవర్గానికి సంబంధించి ప్యాకేజీ నెంబర్ 28 హైలెవల్ కాల్వ పనులు సైతం స్తంభించాయి. ప్రభుత్వం నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయకపోతుండడమే ఈ రెండు కాల్వల నిర్మాణాలకు ఆటంకంగా మారుతుందన్న విమర్శలు ఉన్నాయి.




డిస్ట్రిబ్యూషన్ కాల్వ

కొత్త ప్రభుత్వంపై ఆశలు

ప్యాకేజీ 27 హైలెవల్ కాల్వలకు సంబంధించిన మిగిలిన పనులన్నీ గత ప్రభుత్వం మరో కాంట్రాక్టర్‌కు అప్పగించింది. దీనికోసం రూ.298.51 కోట్లు తాజాగా మంజూరు చేయడమేకాకుండా రాబోయే 2024లోగా పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే 300 ఎకరాల భూమిని అదనంగా సేకరించనున్నారు. దీనికోసం ఇప్పటికే నోటిఫికేషన్‌ను కూడా జారీచేశారు. మేడిపెల్లి, బోరిగాం, చించోలి(బి), నర్సాపూర్(జి) గ్రామాల్లో ఈ భూసేకరణ చేపట్టారు. అలాగే సోన్ మండలంలోని కడ్తాల్ వద్ద మరో పంప్‌హౌజ్‌ను కూడా నిర్మించనున్నారు. కడ్తాల్ నుంచి మామడ వరకు పదకొండు కిలో మీటర్ల పొడవుతో పైప్ లైన్ నిర్మించనున్నారు. ఈ హైలెవల్ కాల్వ పూర్తయితే నిర్మల్‌తో పాటు మామడ, లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, సారంగాపూర్, నర్సాపూర్(జి), సోన్ మండలాల్లో అదనంగా 50వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడుతోంది. కొద్దిరోజులక్రితం పరిహారానికి సంబంధించిన డబ్బులను కూడా రైతులకు చెల్లించారు. దీంతో ప్రధాన సమస్య పరిష్కారం అయినప్పటికీ కీలకమైన కెనాల్ పనులపైనే నీలినీడలు కమ్ముకుంటుండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోందని అంటున్నారు. అనుకున్న గడువులోగా ఈకెనాల్ నిర్మాణం పూర్తికాక రైతులు అదనపు సాగుకు దూరమయ్యారంటున్నారు.

దయనీయంగా ప్యాకేజీ 28 కెనాల్ పరిస్థితి

ముథోల్‌లో 50వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ హైలెవల్ కాల్వ కోసం రూ.486.67 కోట్లను కేటాయించారు. ఇప్పటివరకు కేవలం 235 కోట్లను మాత్రమే ఖర్చుచేశారు. 48.37శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. ఇంకా 3025 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందంటున్నారు. ఇప్పటివరకు కేవలం 550 ఎకరాల భూమిని సేకరించారు. 2020లోగా ఈ కాల్వపనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటికీ ఆ లక్ష్యం నెరవేరడం లేదు. ఈ పనులు పూర్తి కావాలంటే మరిఇంకా ఎన్నేళ్లు వేచి చూడాల్సి వస్తుందోనని రైతులు వాపోతున్నారు. అప్పటి ప్రభుత్వ ప్రతిపాదనలు అంచనాలు తలకిందులవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా కనీసం కాల్వల పనులను పకడ్బందీగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని కోరుతున్నారు.



దిలావర్‌పూర్‌లో అసంపూర్తిగా ప్యాకేజీ 28 నిర్మాణ పనులు

సాగునీరు అందేది ఎప్పుడు..?

- గౌతం, రైతు, చించాల



కాళేశ్వరం 28వ ప్యాకేజీ ద్వారా పంటలకు సాగునీరు అందితేనే నా ఐదు ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. కానీ ఏళ్లు గడిచిపోతున్నా ఆ పనులు పూర్తికావడం లేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా పనులను త్వరగా పూర్తి చేసి సాగునీరు అందించాలని వేడుకుంటున్నా.

పనులు త్వరగా పూర్తి చేయాలి

- నార్వడే గంగాధర్ పటేల్, రైతు, మాడేగాం



ప్యాకేజీ నెంబర్ 27 కింద చేపడుతున్న నిర్మాణ పనుల ను త్వరగా పూర్తిచేయాలి. గత దశాబ్ద కాలంగా ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కాల్వల నిర్మాణ పనులను పూర్తి చేసి బీడు భూములకు సాగునీరు అందించాలి.



నిర్మాణంలో ఉన్న పంప్ హౌజ్

జిల్లాలో భారీ వర్షం

- జిల్లాలో 23.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- అత్యధికంగా లక్ష్మణచాందలో 49.2 మి.మీ. వర్షపాతం



కడెం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల అవుతున్న దృశ్యం

నిర్మల్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి జిల్లాలో 23.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా లక్ష్మణచాంద మండలంలో 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులైన కడెం, గడ్డెన్న వాగు, స్వర్ణ ప్రాజెక్టులలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.326 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కడెం ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.189 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఎగువన భారీవర్షాలు కురుస్తుండడంతో ఆదివారం కడెం ప్రాజెక్టులోకి 6,506 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండంతో ప్రాజెక్టు ఒక వరద గేటును ఎత్తి 4,759 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

- భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



మాట్లాడుతున్న భైంసా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు కాశీనాథ్

భైంసా, ఆగస్టు25: వినాయక చవితి ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు చేపడుతామని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం పోలీసు స్టేషన్ ఆవరణలో హిందూఉత్సవ సమితి కార్యవర్గ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్‌తోపాటు పలువురు కార్యవర్గ ప్రతినిధులు వేడుకల నిర్వాహణ గూర్చి పలు సమస్యలను వివరించి సూచనలు, సలహాలు అందించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. శోభాయాత్ర కొనసాగే మార్గంలో విద్యుత్ తీగలు వేలాడకుండా, ప్రమాదాలలు జరగకుండా ముందస్తు చర్యలు ఏఎస్పీ ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలన్నారు. సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాల్లో బారికేడ్ల నిర్మాణాలు చేపట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ పరిధిలో బెల్ట్‌షాపులు కొనసాగకుండా మూసివేపియాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖాధికారులతో సమన్వయం చేసుకొని నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఉత్సవ సమితి ప్రతినిధులు పోలీసుశాఖ పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. సోషల్ మీడియాలో ఎలాంటి దుష్ప్రచారానికి పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. అన్నివర్గాల ప్రజలు శాంతి, సంయమనాలతో వ్యవహరిస్తూ వేడుకలు ఆద్యాంతం ప్రశాంత వాతవరణంలో కొనసాగేలా చూడాలన్నారు. ఇందులో సీఐ రాజారెడ్డి, ఎస్సై గౌస్, ఉత్సవ సమితి శ్రేణులు పాల్గొన్నారు.

మన్‌కి బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

నిర్మల్‌టౌన్, ఆగస్టు25: జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన మన్‌కి బాత్ కార్యక్రమాన్ని జిల్లా నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యన్నగారి రాజేందర్, నాయకులు వెంకటపతి, పంతికే ప్రకాష్, తదితరులు ఉన్నారు.



మన్‌కి బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని చెట్ల నరికివేత



ఆసుపత్రి ఆవరణలో నరికిన చెట్లు ఇవే..

ముథోల్, ఆగస్టు 25: ముథోల్ లోగల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న చెట్లను ఆదివారం నరికి వేయటంపై పలువురి నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఒక వైపు మొక్కలు నాటాలని, వాటిని బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిస్తుండగా మరోవైపు ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేయటం చర్చనీయాంశంగా మారింది. చెట్ల నరికివేత విషయం తెలుసుకున్న స్థానిక యువకులు ఆసుపత్రికి వెళ్లి వైద్య సిబ్బందిని నిలదీశారు. చెట్లతో ఏమైనా ఇబ్బందులు ఉంటే కొమ్మలు తీస్తే సరిపోతుందని వాదించారు. చెట్లు నరకడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెట్లను నరికి వేయాలంటే ముందుగా సంబంధిత శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకున్న తర్వాత చెట్లను నరకాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ జాదవ్ వివరణ కోరగా చెట్ల నరికివేస్తున్న విషయం తనకు ఆలస్యంగా తెలిసిందని చెప్పారు. చెట్లను నరికిన వ్యక్తికి కొమ్మలు తీసి వేయాలని చెబుతే చెట్టును పూర్తిగా తీసివేసినట్టు తన దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే చెట్లపై గబ్బిలాలు ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పుకొచ్చారు. అయితే కొమ్మలు తీయాలని సదరు వ్యక్తికి చెప్పగా ఆయన సరిగా అర్థం చేసుకోక చెట్లను పూర్తిగా నరికి వేసినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు.



ప్రశంసాపత్రాలతో ప్రదర్శననిచ్చిన చిన్నారులు

బాసర అమ్మవారి సన్నిధిలో
చిన్నారుల నాట్య ప్రదర్శన

బాసర, ఆగస్టు25: బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఆదివారం చిన్నారుల నాట్య ప్రదర్శన భక్తులను, చూపరులను ఆకట్టుకుంది. సనాతన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారులు కళాప్రదర్శన ఇచ్చారు. వివిధ బృందాలుగా పాల్గొన్న ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

- భైంసా కూచిపూడి నృత్య కళాకారులకు అవార్డులు

భైంసా: భైంసాలోని శార్వాణి సంగీత నృత్యానికేతన్ కళాకారులు తమ అబ్బురపరిచే నృత్య ప్రదర్శనలతో పలు అవార్డుల పురస్కారం పొందారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికపై తెలంగాణ సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు సంస్కృతి సాహితీ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న భైంసా కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహుతుల మన్ననలు పొందాయి. ప్రతిభను కనబరిచిన కళాకారులకు నిర్వాహణ సంస్థ పలు అవార్డుల పురస్కారాన్ని అందించి సన్మానించింది. ఇందులో కూచిపూడి నృత్యరంగానికి విశేష సేవలు అందిస్తున్న భైంసా శార్వాణీ సంగీత నృత్యానికేతన్ శిక్షకురాలు మియపూరం శ్రీవాణికి మహానంది పురస్కారం లభించింది. మిగతా కళాకారుల్లో రమ్య కృష్ణకి మయూరి, ప్రణీత, లక్షిత, అవిక, సిద్దేశ్వరీలకు సాహితీ సేవా జాతీయ పురస్కారం పొందారు. కళాకారులకు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అవార్డులను అందజేశారు.



అవార్డులతో నృత్య కళాకారులు

రైతు ఆత్మహత్యాయత్నం

● పంట చేనులో పశువులు మేపారని అఘాయిత్యం

కుంటాల, ఆగస్టు, 25: కుంటాల మండలంలోని అంబకంటి పంచాయతీ పరిధిలోని రాయపాడ్ తండాకు చెందిన జ్ఞానేశ్వర్ అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపాడ్ తండాకు చెందిన రైతు జ్ఞానేశ్వర్ పంట చేనులో పత్తి పంటను సాగు చేశాడు. ఏపుగా పెరిగిన పత్తి పంటను అటవీ అదికారులు గొర్రెలు మేపించారని పురుగుల మందు తాగాడు. జ్ఞానేశ్వర్ వ్యవసాయంతో పాటు నిర్మల్‌లోని ఓ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. గత ప్రభుత్వ హయాంలో అటవీ భూమి హక్కు పత్రాన్ని పొందిన 3.5 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. అటవీ అధికారులు పంటను మేపిస్తున్నారన్న సమాచారంతో హుటాహుటిన గ్రామానికి చేరుకొని భార్య భర్తలిద్దరు పంట చేనులోకి వెళ్లి పరిశీలించారు. ఏపుగా పెరిగిన పత్తి పంటను అదికారులు మేపించారనే మనస్తాపంతో జ్ఞానేశ్వర్ పురుగుల మందు తాగారు. పరిస్థితిని గమనించిన స్థానికులు 108లో భైంసా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ విషయమై అటవీ శాఖ ఇన్‌చార్జి డీఆర్‌వో శంకర్‌ను సంప్రదించగా గతంలో కూడా అటవీ భూమిలో పంట సాగు చేశారని అయితే అప్పుడే అధికారులు అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. రైతు గతేడాదే పంట భూమిలో సాగుచేయనని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడన్నారు. ప్రస్తుతం అతను సాగు చేసిన 3.5 ఎకరాల నుంచి అర ఎకరం ప్రభుత్వ భూమి కావున అందులో మాత్రమే పశువులు మేపించడం జరిగిందని, మొత్తం పంట చేనులో పశువులను మేపించారనడం సరికాదన్నారు.

గిరిజన బాలికకు వైద్యం

ఉట్నూర్, ఆగస్టు 25: నేరడిగొండ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా6వ తరగతి విద్యార్థిని కుస్రంబేబి తర్బు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకొని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఈ నెల 13న వైద్య పరీక్షలు చేయించారు. గుండెకు రంధ్రం పడి ఉందని డాక్టర్ల పరిశీలనలో తేలడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఇన్‌చార్జీ డీడీ వసంతరావు, ఏడీఎంహెచ్ఓ మనోహర్‌ల ఆదేశాల మేరకు బోథ్ ఏటీడీఓ అమిత్ హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తీసుకవెళ్లి గత 19న గుండె ఆపరేషన్ చేయించడంతో అమ్మాయి ఆరోగ్యం మెరుగు పడింది. ఐటీడీఏ పీఓ ప్రత్యేక చొరవతో ఈ ఆపరేషన్ పూర్తి చేయించడం విద్యార్థుల పట్ల వారికున్న శ్రద్ధ, ప్రేమకు నిదర్శనమని గిరిజనులు అంటున్నారు.

వైన్స్‌లో దొంగతనం

నేరడిగొండ, ఆగస్టు 25: మండలంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది మండలంలోని ఉన్న వరుణ్ లిక్కర్ మార్ట్ వైన్స్‌లో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వైన్స్‌లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. 123360 రూపాయల మందుబాటిల్, రూ.8050ల నగదు అపహరణకు గురైందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వైన్స్ నిర్వాహకుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి సీసీ ఫుటేజ్‌పరిశీలించి మఇగ్గురు నిందితులు దొంగతనానికి పాల్పడ్డారని వారికోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాంసి, ఆగస్టు 25: ప్రస్తుతం వర్షాకాలమైనందున పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని మండల వైద్య బృందం ప్రజలకు సూచించారు. ఆదివారం బండల నాగాపూర్, అట్నంగూడ గ్రామాల్లో వైద్య బృందం పర్యటించింది. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. మురికి నీరు నిలువ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏదైనా వ్యాధులు సోకితే వెంటనే ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ తులసీరామ్, లక్ష్మీ, పద్మ, అరుణ తదితరులు ఉన్నారు.

బరంపూర్‌లో దొంగల బీభత్సం

● రెండు దుకాణాల్లో చోరీ

తలమడుగు, ఆగస్టు 25: మండలంలోని బరంపురం గ్రామంలో శనివారం రాత్రి దొంగలు పడి రెండు దుకాణాల్లో తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాల ప్రకారం మండలంలోని బరంపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు వచ్చి గ్రామంలో గల దుకాణాలను తాళాలు పగులగొట్టి ఒక దుకాణం నుంచి 20 వేల నగదు, కొంత సామాగ్రిని దొంగిలించారు. అదే విధంగా మరోదుకాణంలో తాళాలు పగులగొట్టి చోరీకి ప్రయత్నించినప్పటికీ దుకాణంలో ఎలాంటి దొంగతనం జరగలేదని పోలీసులు తెలిపారు. దుకాణం యజమానుల ఫిర్యాదు మేరకు పోలీస్ క్లూస్ టీమ్ సహకారంతో వివరాలను సేకరించడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ముమ్మరంగా దర్యాప్తు చేపట్టిన త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

సంతానం కావడం లేదని పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, ఆగస్టు 25: పెళ్లి అయి 10 సంవత్సరాలు అయినా సంతానం కలగడం లేదని ఒక్కరు ఆత్మహత్య చేసిన సంఘటన ఆదివారం మండలంలోని పిట్టబొంగరం గ్రామంలో జరిగింది. కుటుంబీకులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం... పిట్టబొంగరం గ్రామానికి చహకటి జంగుబావు (30)కు 10ఏళ్ళ క్రితం ఇచ్చోడ మండలంలోని దాబా గ్రామానికి చెందిన సీతాబాయితో వివాహం జరిగింది. కాని ఇప్పటి వరకు సంతానం కలుగలేదు. పలు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించిన నాటు వైద్యం తీసుకున్న సంతానం కాకపోవడంతో గత నాలుగు నెలల నుంచి జంగుబావు తాగుడికి బానిసయ్యాడు. దీంతో భార్య సీతాబాయి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటు భార్య కాపురానికి రాకపోవడం, సంతానం లేకపోవడంతో మరింత తాగుడికి బానిసయ్యాడు. శనివారం ఉదయం తాగిన మైకంలో వ్యవసాయ చేనుకు వెళ్లిన జంగుబావు గుర్తు తెలియని పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. చుట్టూ పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అన్న చహకటి జగ్గేరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుట్కా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బోథ్, ఆగస్టు 25: మండలంలోని కనుగుట్ట గ్రామం సమీపంలో గుట్కా సరఫరా చేస్తున్న ఇచ్చోడకు చందిన షేక్ జావీద్ అనే వ్యక్తిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు బోథ్ ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. ఆయన వద్ద నుంచి 27611రూపాయల గుట్కాను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు. ముందస్తు సమాచారంతో పట్టుకున్నామని తెలిపారు.

అన్నాభావు సాఠే అందరికీ ఆదర్శం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 25: అన్నాబావుసాఠే విలువలు నేటి తరం కాపాడుకొని ఆచరణలో ముందుకు సాగాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ లోక ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని వార్డ్ నెంబర్.18 రణదివ్య నగర్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతున్న అన్న బహుసాఠె ఆ కాలంలోనే ఉన్నత విద్యకు కలిగే ప్రాధన్యత ప్రయోజనాలని ప్రజలకు వివరించి వారిని ప్రోత్సహించి ముందుకు సాగేలా చేశారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్ మాల్వే, రణదివ్య నగర్ మాతాంగ్ సమాజ్ ప్రెసిడెంట్ కాంబ్లే శ్యాం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 25 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా బైపాస్ వద్ద ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు స్పందించి వెంటనే ఆయనను రిమ్స్‌కి తరలించారు. వైద్యులు బాధితుడికి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వ్యక్తిని గుర్తుపట్టిన వారు ఎవరైనా ఉంటే రిమ్స్‌లో సంప్రదించాలని అవుట్ పోస్టింగ్ పోలీసులు పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 25: జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన ముద్దం సురేష్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడతున్నారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఆయన దీన స్థితిని సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు చలించిపోయారు. ఆదివారం ఆయన కుటుంబాన్ని సందర్శించి నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యును కాలనీ పెద్దలు, కాలనీవాసులు అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు వినోద్ కుమార్, రాజేందర్, కరుణాకర్, సుధీర్, ప్రేమ్ విశాల్, రమేష్, జైపాల్, దుర్గ ప్రసాద్, ప్రమోద్, లెనిన్, రవీందర్ మహేష్, మహేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కుంటాల, ఆగస్టు, 25: మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన రోడ్డ అడెల్లు అనే రైతుకు చెందిన ఆవు ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. అడెల్లు ప్రతిరోజు మాదిరిగానే ఆదివారం ఆవును మేతకు తీసుకెళ్లిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎరితింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఆవు మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ. 50,000 వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు పేర్కొంటున్నాడు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 25: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో మున్నూరు కాపు యువత, ఉద్యోగ సంఘాల ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. అంకోలి మున్నూరుకాపు గ్రామ సంఘం అధ్యక్షునిగా రాహుల్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రం రాహుల్, ఉద్యోగ సంఘాల అధ్యక్షునిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా హరిదాసును ఎన్నుకున్నారు. సమావేశంలో నర్సింగరావు, రమణ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నిర్మల్అర్బన్, ఆగస్టు 25: మున్నూరు కాపు ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడ మున్నూరుకాపు వసతిగృహ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్ రావు ఉత్తమ పురస్కారాలతో పాటు నగదు పారితోషకం అందజేశారు. అందులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుమ్ముల అశోక్ కూతురు హను ఇంటర్మీడియట్‌లో 96 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ మున్నూరుకాపు ట్రస్ట్ బోర్డు ఏర్పాటై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా 2023, 2024లో ప్రతిభ కనబరిచిన రాష్ట్రంలోని మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు ట్రస్ట్ బోర్డు సభ్యులు దేవేందర్, పిల్లి శ్రీనివాస్, యోగేందర్, అన్నపూర్ణ, ఆయా జిల్లాల సంఘప్రతినిధులు పాల్గొన్నారు.

కుభీర్‌లో మద్యం పట్టివేత

కుభీర్, ఆగస్టు 25: మండల కేంద్రం కుభీర్‌లో ముచ్చిండ్ల విఠల్ నిర్వహిస్తున్న బెల్టుషాపులో పోలీసులు తనిఖీ చేశారు. అక్రమ విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. తనిఖీలో 4.14 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాదనకుర్తిలో ఉచిత వైద్య శిబిరం

ఖానాపూర్, ఆగస్టు25: మండలంలోని బాదనకుర్తి గ్రామంలో ఆదివారం నిర్మల్‌కు చెందిన డాక్టర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు ఖానాపూర్ వైద్యులు డా.వేణుగోపాలకృష్ణ, వైద్యులు శ్రీనివాస్, శివ కుమార్ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, పుప్పాల పెద్ద నర్సయ్య, నాయకులు బూసి నరేదర్, సజ్జు, గుడాల రాజన్న, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాందలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

లక్ష్మణచాంద, ఆగస్టు25: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005-06 విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పుష్పాలు చల్లుతూ పూర్వ విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం గత స్మృతులు, అనుభవాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగారెడ్డి, వెంకట రమణ, రాఘవరెడ్డి, అనుపమ, వినోద్ కుమార్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.




ఆత్మీయ సమ్మేళనంలో గురువులు, పూర్వ విద్యార్థులు

పెరుగుతున్న గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిమట్టం

● ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వస్తున్న వరద ● పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో ప్రాజెక్టు

భైంసా,ఆగస్టు25: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి గత ఆరు రోజులుగా వరద నీటి చేరిక కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్టు నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. గత సోమవారం ప్రాజెక్టు నీటి మట్టం 357.2 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి మట్టం 357.6 మీటర్లకు ఎగబాకింది. ఆరు రోజుల వ్యవధిలో ప్రాజెక్టులోకి మొత్తం 0.161 టీఎంసీ వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు నీటి మట్టం 0.4 మీటర్ల పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు, 1.852 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండగా ప్రస్తుత నీటిమట్టం 357.6 మీటర్లు, 1.326 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుత సీజన్ ప్రాజెక్టులోకి 0.650 టీఎంసీల వరద వచ్చి చేరింది. ఇక ఆదివారం ప్రాజెక్టులోకి 464 క్యూసెక్కుల వరద చేరిక కొనసాగింది. జిల్లాలోని కడెం, స్వర్ణ ప్రాజెక్టులు వరద నీటితో నిండుకపోవడంతో వరద గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. అయితే గడ్డెన్న వాగుప్రాజెక్టు పరిస్థితి భిన్నంగాఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురియకపోవడంతో వరద నీటి చేరిక అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్టు నీటి నిల్వలు పూర్తి స్థాయి సామర్థ్యానికి కంటే 0.526 టీఎంసీలు తక్కువగా ఉండగా నీటి మట్టం 1.1 మీటర్లు తక్కువగా ఉంది.



గడ్డెన్నవాగు ప్రాజెక్టు



మాట్లాడుతున్న శ్రీహరిరావు

కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ టౌన్, ఆగస్టు 25: అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మజర్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. మజర్‌ని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, సమస్య ఏదైనా ఉంటే అండగా ఉంటానని భరోసాఇచ్చారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శ్రీహరిరావుతో పాటు మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు అతిక్ అహ్మద్, కలీం, తదితరులు ఉన్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఆయకట్టు భూములకు

సాగునీటి కేటాయింపుల పెంపు

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 25: ఆయకట్టు రైతాంగం ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటికి కేటాయింపులు పెంచినట్లు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఇదివరకు ప్రాజెక్టు నుంచి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడం కంటే మిషన్ భగీరథ ద్వారా తాగునీటికే కేటాయింపులు అధికంగా జరిగినట్లుగా పేర్కొన్నారు. ప్రాజెక్టుపూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు, 1.852 టీఎంసీల సామర్థ్యం ఉందన్నారు. ఇందులో నుంచి ఇదివరకు 357.5 మీటర్ల వరకు (1.286 టీఎంసీలు) మిషన్ భగీరథపథకం నిర్వహణకు కోసం నీటినిల్వలు కేటాయించి మిగతా నీటిని మాత్రమే సాగునీటి కోసం కేటాయించినట్లు చెప్పారు. తద్వారా సాగు నీటికి 0.6 టీఎంసీల నీటి కేటాయింపు జరుగగా తాగునీటికి 1.2టీఎంసీల కేటాయింపులు జరిగాయన్నారు. తమవిజ్ఞప్తి మేరకు రాష్ట్రప్రభుత్వం ప్రాజెక్టు నీటి కేటాయింపులపై పూర్తిస్థాయి విశ్లేషణ చేసిందని చెప్పారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం నీటి కేటాయింపులపై సవరణప్రక్రియ చేపట్టిందన్నారు. తద్వారా ప్రాజెక్టు నుంచి తాగునీటి కంటే ఆయకట్టు భూములకు సాగునీటిని అందించేందుకు కేటాయింపుల పెంచినట్లు పెర్కొన్నారు. సవరణ ప్రకారం మిషన్ భగీరథ పథకం నిర్వహణ కోసం ప్రాజెక్టులో 357.5మీటర్లు (1.286 టీఎంసీలు) కాకుండా 355.9 మీటర్లు (0.6 టీఎంసీలు) మాత్రమే నీటినిల్వలను పరిమితం చేసినట్లుగా వెల్లడించారు. మిగతా 1.286 టీఎంసీల నీటి నిల్వలన్నింటినీ సాగునీటి కోసం కేటాయించినట్లు తెలిపారు. సవరణ ప్రక్రియ ప్రకారం ఆయకట్టు భూములకు అదనంగా 0.6 టీఎంసీల నీటినిల్వలు కేటాయించినట్లు వివరించారు. తద్వారా రెండుసీజన్లలోనూ ఆయకట్టు భూములకు సరిపోయేంతగా సాగునీటిని అందించే వెసులుబాటు కలిగిందన్నారు. సాగునీటి కేటాయింపుల పెంపునకు చర్యలు చేపట్టిన సీఎం, మంత్రులకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా వివరించారు. సమావేశంలో భైంసా మున్సిపల్ కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపాల్ సర్డా, తానూర్ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

జాబ్‌మేళాకు విశేష స్పందన

నిర్మల్ అర్బన్, ఆగస్టు25: జిల్లాకేంద్రంలో ఆదివారం దీక్ష జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నాయకులు మాట్లాడుతూ సుమారు 1500 పైచిలుకు ఉద్యోగాలతో 50కంపెనీలకు పైగా పాల్గొన్నాయని, నిరుద్యోగులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందినట్లు చెప్పారు. ముఖ్యంగా నిరుద్యోగాలతో విద్యార్థులు చెడుమార్గాన్ని అనుసరించకుండా ఇటువంటి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని విద్యార్థులందరూ ఈజాబ్‌మేళాలు విజయవంతం చేసుకుని మంచిమార్గంలో నడిచేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా దీక్ష కాలేజీ యాజమాన్యం శ్రీఅఖిల భారత అయ్యప్పసేవా ట్రస్ట్ సభ్యులు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తేలు శ్రీనివాస్, కనపర్తి విఘ్నేష్, రాజాగౌడ్, జావ ప్రకాష్, జనగాం శ్రీనివాస్, బండారి వీరబాబు, తదితరులు ఉన్నారు.

'ధర్మసమాజ్ పార్టీతోనే ప్రజలకు న్యాయం'

నిర్మల్అర్బన్, ఆగస్టు 25: తెలంగాణలోని 93శాతం ప్రజలకు ధర్మసమాజ్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కండెల సుమన్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలో గల వైఎస్ఆర్ కాలనీలో ఆ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటివరకు ఉన్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలన్నీ అగ్రకులాలకే నాయకత్వం, సంపద, అధికారం ఇస్తున్నాయని, ధర్మసమాజ్ పార్టీ దానికి భిన్నంగా రాష్ట్రంలోని 93శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భారత రాజ్యాంగ సూత్రం ప్రకారం అన్నిరకాల అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో ఇప్పటికీ బీసీ, ఎస్సీ, ఎస్టీల బతుకుల్లో అగ్రకుల పార్టీలు ఎలాంటి మార్పు తేలేదని విమర్శించారు. అంతకుముందు రాష్ట్ర కార్యదర్శిగా మొదటిసారి జిల్లాకు వచ్చిన కండెల సుమన్‌కు పార్టీ జిల్లాప్రచార కమిటీ, కాలనీ వాసులు శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, కల్లూరు సుధాకర్ మహారాజ్, శ్రీనివాస్ మహారాజ్, రాజు, భూమేష్, శేఖర్, షేక్ నహీం, తదితరులు పాల్గొన్నారు.

గిడుగు జాతీయ పురస్కారానికి తొడిశెట్టి

నిర్మల్అర్బన్, ఆగస్టు25: ప్రముఖ సంఘసంస్కర్త, సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుభాష, సాహిత్యం, కళ, సేవా రంగాలలో విశిష్ఠ సేవలందించిన వారికి జాతీయస్థాయిలో ఇచ్చే పురస్కారానికి నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, జాఫ్రాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్ ఎంపికయ్యాడు. ఈనెల 29న విజయవాడలో నిర్వహించే అవార్డుల కార్యక్రమంలో వీరికి ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో 'గిడుగు రామ్మూర్తి జాతీయ సాఫల్యత పురస్కారం' అందించనున్నారు. వైజ్ఞానిక సౌరభాలు, మొల్లమాంబ సాహితీ వైభవం, అక్షర సౌరభం పుస్తకాలను రచించినందుకు, తెలుగుభాషా పరిరక్షణ కోసం నిర్మల భారతిసాహితీ కళాక్షేత్రాన్ని స్థాపించి సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు, ఆకాశవాణిలో ప్రసారమైన ప్రసంగాలకు జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు పరమేశ్వర్ తెలిపారు.

నిరుపేద యువతుల పెళ్లికి పుస్తె, మెట్టెల అందజేత

ఖానాపూర్, ఆగస్టు25: మండలంలోని గోసంపల్లె, పాత ఎల్లాపూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు నిరుపేద యువతుల పెళ్లిళ్లకు ఓకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె, మెట్టెలను అందజేశారు. ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఓకేఆర్ ఫౌండేషన్ బృందం తెలిపింది.

అధ్వానస్థితిలో అర్లి(టీ) రోడ్డు

భీంపూర్, ఆగస్టు 25: మండలంలోని అర్లి(టీ) నుంచి భగవాన్‌పూర్ వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల రోడ్డు అధ్వాన స్థితిలో ఉంది. ఇక ఈ వర్షాకాలంలోనైతే రోడ్డుపై ద్విచక్ర వాహనలు, ఎడ్ల బండ్లు నడవలేని పరిస్థితి ఉంది. బురదలో రోజుకో ప్రమాదం జరుగుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఇదే దారిలో వెళ్తున్న భగవాన్‌పూర్ వాసులు బురదలో బండి ఇరుక్కొని కింద పడిపోయారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు నిర్మాణంపై శ్రద్ధ తీసుకోవాలి.



బురదలో పడిపోయిన భగవాన్‌పూర్‌వాసులు

సీఎంఆర్ చెక్కు అందజేత

నేరడిగొండ, ఆగస్టు 25: మండలంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన పెంట జానకికి మంజూరైన 28వేల రూపాయల చెక్కును బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఇది ప్రజల ప్రభుత్వ ప్రజల సంక్షేమాలు అన్ని విధాలుగా అందరికీ అందేవిధంగా చూస్తానని ఆయన అన్నారు. ఆయన వెంట బోథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, బ్లాక్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పోతారెడ్డి, మౌలాన, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను పునః పరిశీలించాలి

ఉట్నూర్, ఆగస్టు 25:ఎస్సీ వర్గీకరణను పున: పరిశీలించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డివిజన్ ప్రధాన కార్యదర్శి తౌటిఆశన్న అన్నారు. మండల కేంద్రంలో ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత సుప్రీంకోర్టు వర్గీకరణ చేయడం వల్ల మాలలు, ఉప కులాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక పరంగా నష్టపోతారని అన్నారు. తద్వారా నిరుద్యోగ యువతి యువకులు ఉద్యోగాలు దొరకక రోడ్డున పడతారన్నారు. అదే విధంగా వర్గీకరణ చేయడం వల్ల దళితుల ఐక్యత దెబ్బతింటుందని అన్నారు. వర్గీకరణకు రాజకీయ పార్టీలు లబ్ధి కోసమే వత్తాసు పలుకుతున్నాయని అన్నారు. దళితులకు రిజర్వేషన్ శాతం పెంచాలన్నారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేవలం మాదిగ నాయకులని పిలిపించుకుని రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొనడం సమంజసం కాదని అన్నారు. మాలల ఉప కులాలను పిలిపించుకని తమ అభిప్రాయం తెలుసుకోవాల్సిందని అన్నారు. రిజర్వేషన్ అమలు చేయడమే కాకుండా గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లకు కూడా రిజర్వేషన్ వర్తింప చేస్తాననడం సమంజంసం కాదని అన్నారు. రాష్ట్రంలో మాలలు ఉప కులాలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గత ఎన్నికల్లో ఓటు వేయడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు మిగత కులాల అభిప్రాయం తెలుసుకోకుండా వారి జీవన విధానం తెలుసుకోకుండా వర్గీకరణ అమలు చేయాలని తీర్పు ఇవ్వడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు మాలల ఉప కులాల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎస్సీ వర్గీకరణ పున పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు బోనకంటి సుభాస్, నాయకులు దామెరకనకారావు, వెలుమల మధు, వెంకటి, నీరటి రవి, రాజ కుమార్, వెంకటేశ్, సంజీవ్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

బోథ్, ఆగస్టు 25: మండలంలోని సాయినగర్, సాగర గ్రామాలలో మృతి చెందిన బీజేపీ పార్టీ కార్యకర్తలు కె.రవి జాదవ్, భరత్ కుటుంబాలను ఆదివారం సాయంత్రం ఆదిలాబాద్ ఎంపీ గూడెం నగేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని కుటుంబాల వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, బోథ్ మండల సహకార సంఘం అధ్యక్షుడు కదం ప్రశాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, రాజేశ్వర్‌లతో పాటు మాజీ ఎంపీపీ అక్కు కిషన్, వెంకన్న, విష్ణు, వామన్, తదితరులు ఉన్నారు.

సివిల్ సూట్లను విచారించే అధికారం కల్పించాలి

● ఆదివాసీ గిరిజన నాయకుల డిమాండ్

ఉట్నూర్, ఆగస్టు 25: రాష్ట్ర గవర్నర్, తెలంగాణ ప్రభుత్వం గిరిజన టీఎస్సీ తీర్మానం చేసి వెంటనే ఐటీడీఏ పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారం తీసుకురావాలని కోరుతున్నామని రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు డిమాండ్ చేశారు. ఆయన స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని సివిల్ సూట్ దావాలను విచారించే పరిధి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి లేదని హైకోర్టు తెలిపిందని ఆ అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉందని స్పష్టం చేసిందన్నారు. ఓ సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను చేతిరాత నిపుణులకు పంపాలన అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఉత్తరాలను జారీ చేయడంతో దాన్ని సవాల్ చేస్తూ ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన చవాన్‌ప్రకాష్ హైకోర్టును ఆశ్రయించారన్నారు. విచారణ సందర్భంగా సివిల్ సూట్‌లను ఐటీడీఏ పీవో అధికారంలో విచారిస్తున్నారని కోర్టు పశ్నించిందని, 2002లో అప్పటి ఆదిలాబాద్ కలెక్టర్ ప్రోసిడింగ్స్ జారీ చేసి అదనపు ఏజెంట్‌గా ఐటీడీఏ పీఓకు ఒక సివిల్ సైట్‌లను విచారించే బాధ్యతలు అప్పగించారని ప్రస్తుత కలెక్టర్ వెల్లడించారన్నారు. ఆ ఉత్తరాలు ప్రకారమే ఆదిలాబాద్‌తో పాటు నిర్మల్, మంచిర్యాల కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలో సివిల్ సూట్‌లను భూ బదలాయింపు నిబంధన ఏజెన్సీ నిబంధన కింద ఐ టీడీఏ పీఓ విచారిస్తున్నట్లు పేర్కొన్నారన్నారు. కలెక్టర్ సమర్పించిన నివేదిక పరిశీలించిన న్యాయమూర్తి ప్రభుత్వ ఏజెంట్ కలెక్టర్‌కు ఉన్న అధికారిన్ని ఐటీడీఏ పీఓకు బదిలీ చేయడానికి వీల్లేదని తెలిపారన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులు ఆర్థికంగా బీదవారు అయినందున ఉట్నూర్ ఐటీడీఏకు రావడమే చాలా కష్టం అని అలాంటిది కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్లి ప్రతిరోజు వారి సివిల్ కేసులు చెప్పడమంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఏజెన్సీలో గిరిజనులకు 24 గంటలు పని చేస్తారని, కానీ కలెక్టర్ 24గంటలు గిరిజనులకు పని చేయరని, కలెక్టర్ సమయం ఇవ్వరు కనుక ఐదవ షెడ్యూల్‌లోని భూభాగంలో ఉన్నటువంటి అధికారాలు ఏవైతే ఉన్నాయో? చూసి పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో కొద్దుపటేల్, కొంత ఆశరెడ్డి, మేస్రం కేశవ్, భీమ్‌రావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగం విషంరావు

ఘనంగా బ్రహ్మంగారి ఆలయ వార్షికోత్సవం

● తలమడుగులో కన్నులపండువగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి-గోవిందమ్మల కల్యాణం ● తరలివచ్చిన భక్తజనం

తలమడుగు, ఆగస్టు 25: మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి 4వ ఆలయ వార్షికోత్సవం కన్నుల పండుగ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమ్మల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, విశ్వకర్మ సంఘం నాయకులు మాట్లాడుతూ మహా జ్ఞాని కాలజ్ఞాన మహానుభావుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కరుణ కటాక్షాలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఆలయం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఆలయంలో యజ్ఞ కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో గ్రామంలోని పలు వీధుల గుండా భజా భజంత్రీలతో మంగళ హారతులతో శోభాయమానంగా ఊరేగింపు నిర్వహించారు. ఇందులో విశ్వకర్మ ఆలయఅభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మంగళహారతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

అంగన్‌వాడీ.. అవస్థల బడి!!

● చిరుజల్లులకే లోనికి చేరుతున్న నీరు

బోథ్, ఆగస్టు 25: మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిరు జల్లులకే నీరు చేరుతుంది. ఫలితంగా సెంటర్‌లో నిలువ ఉంచిన ఆహార పదార్థాలు నానిపోవడంతో పాటు పిల్లలకు కూర్చునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు అంగన్‌వాడీ సెంటర్‌ను నూతనంగా నిర్మించాల్సిన అవసరం ఉంది.



● పోచమ్మ గల్లీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఇదే..



సప్తాహ కార్యక్రమంలో పాల్గొన్న పాచ్చెర గ్రామ భక్తులు

పాచ్చెరలో ప్రారంభమైన సప్తాహ

బోథ్, ఆగస్టు 25: మండలంలోని పొచ్చెర గ్రామంలో ఆదివారం హనుమాన్ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు నిరంతరంగా 24 గంటల పాటు రామనామ సంకీర్తన, భజన కార్యక్రమాలను నిర్వహిస్తారు. వారం రోజుల పాటు దీపం అరకుండా తాళం తబలా, భజన కొనసాగుతుంది. ఈ కార్యక్రమం ఆగస్టు 31న ముగుస్తుంది.

తలమడుగు ఎస్సైగా అంజమ్మ

తలమడుగు, ఆగస్టు 25: తలమడుగు ఎస్సైగా అంజమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తలమడుగు ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ధనశ్రీ స్థానంలో గత కొంత కాలంగా ఖాళీగా ఉండటంతో ఎట్టకేలకు ప్రభుత్వం ఆర్మూర్‌లో విధులు నిర్వహిస్తున్న అంజమ్మను తలమడుగు ఎస్సైగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రత సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అదే విధంగా పండుగలను శాంతి సామ్రాజ్యం జరుపుకోవాలని సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించడంతో పోలీసు సిబ్బంది పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.




బాధ్యతలను స్వీకరిస్తున్న అంజమ్మ

రిమ్స్ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 25 : ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్‌ను ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌తో మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు రిమ్స్‌లో రోగులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు రూపేష్‌రెడ్డి, తదితరులున్నారు.

'ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు'

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 25: రుణమాఫీపై రైతులను ఉసిగొలిపి రభస చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదివారం కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. రుణమాఫీపై అందోళనలు, ధర్నాలు చేస్తూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టకొని మాట్లాడాలని హితవు పలికారు. ఇందులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తుమ్మల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





జలపాతం అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

జాలువారే కుంటాల అందాలు!

● జలపాతం వద్ద పర్యాటకుల సందడి

నేరడిగొండ, ఆగస్టు 25: మండలంలోని కుంటాల జలపాతం జాలువారే అందాలను వొలకబోస్తున్నాయి. పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. కుంటాల జలపాతానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల సందడి మొదలయింది. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. జాలువారే అందాలతో పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.



● ఉట్నూర్‌లోని మేజర్ గ్రామ పంచాయతీ

'స్థానిక' పోరుకు.. సన్నద్ధం!

- జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు దగ్గరపడుతున్న రోజులు
- ఓటరు జాబితాకు షెడ్యూల్ ఖరారు
- ఉట్నూర్ మేజర్ పంచాయతీకి ఈసారి ఎన్నికలు
- బహుముఖ పోటీకి సిద్ధమవుతున్న ఆయా పార్టీల అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లకు కార్యాచరణను ప్రారంభించిన అధికారులు

ఉట్నూర్, ఆగస్టు 25: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఆయా పార్టీలకు చెందిన స్థానిక నాయకులు సన్నద్ధం అవుతున్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయని ఎదురుచూస్తున్న ప్రజలకు.. స్థానిక ఎన్నికలు దగ్గరపడ్డాయని ప్రభుత్వాలు చెబుతున్నాయి. గత నాలుగు ఐదు నెలల కిందటే సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. ఫలితంగా గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్న అధికారులు వల్ల గ్రామ పంచాయతీ ద్వారా జరిగే సంక్షేమ కార్యక్రమాలు దూరమయ్యాయంటున్నారు. పంచాయతీ ఎన్నికలు కొత్త సంవత్సరంలో జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తుండడంతో సెప్టెంబరు మాసం నుంచి అధికారులు ఎన్నికల ఏర్పాట్లకు ముందుకు వెళ్లనున్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికల ఏర్పాట్లకు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సైతం జనవరిలో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఆదిలాబాద్ జిల్లాలో 468 గ్రామ పంచాయతీలు, నిర్మల్ జిల్లాలో 396 పంచాయతీలు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 334 పంచాయతీలు, మంచిర్యాల జిల్లాలో 311 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో పాటు మండల పంచాయతీ అధికారులు జిల్లా పంచాయతీ అధికారి నేతృత్వం లో కార్యాచరణ ప్రారంభించారు. గ్రామ పంచాయతీల వారీగా ఉన్న వార్డులలో అభ్యర్థులు రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంది.

ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ ఖరారు

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా తయారీకి ప్రభుత్వం షెడ్యుల్ ఖరారు చేసినట్లు తెలుస్తుంది. సెప్టెంబరు 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రచురించే అవకాశాలు కనిపిస్తున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తుంది. ఓటరు జాబితాపై సెప్టెంబరు 6 నుంచి 13 వరకు అభ్యంతరాలు స్వీకరించి 9, 10వ తేదీలలో రాజకీయ పార్టీల సూచనలు స్వీకరించి అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా 21న వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను అధికారులు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలుస్తుంది.




● ఉట్నూర్ పట్టణం

ఉట్నూర్ మేజర్ పంచాయతీకి ఎన్నికలు

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజనులకు ప్రధాన కేంద్రమైన ఉట్నూర్ పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీకి ఐదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగనున్నాయి. గతంలో జరిగిన ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఉట్నూర్ పంచాయతీని మున్సిపాలిటీగా ప్రకటించడంతో గ్రామ పంచా యతీ ఎన్నికలు నిలిచిపోయాయి. ఉట్నూర్‌ను మున్సిపాలిటీ చేయ వద్దని ప్రజలు కోరడంతో ప్రభుత్వం మున్సిపాలిటీ ప్రక్రియను నిలిపి వేసింది. 2019లో ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహిం చింది. ఉట్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలను విడదీసి కన్నాపూర్, గంగాపూర్, రెండు గ్రామ పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు ఎన్నికలు జరుగగా.. ఉట్నూర్ మేజర్ పంచాయతీకి ఎన్నికలు జరుగకపోవడంతో ప్రత్యేక అధికారి పాలనలో ఐదేళ్లు గడిచిపోయాయి. ప్రస్తుతం ఉట్నూర్ గ్రామ పంచాయతీ జనాభా 20 వేలు కాగా 12వేలకు పైచిలుకు ఓటర్లు, 18 వార్డులు ఉన్నాయి.

బహుముఖ పోటీకి అవకాశాలు

ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా? ఎప్పుడెప్పుడు పోటీలో ఉందామా? అని ఎదురు చూస్తున్న అభ్యర్థుల పోటీ మెండుగానే కనిపిస్తోంది. ఉట్నూర్ సర్పంచ్ స్థానానికి కనీసం 20 మంది అభ్యర్థులు పోటీపడేలా సిద్ధమవుతున్నారు. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం గిరిజనులకు రిజర్వు చేయడంతో ఉప సర్పంచ్ స్థానంపై గిరిజనేతర అభ్యర్థులు కన్ను వేశారు. పార్టీలకు అతీతంగా జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు అధిక శాతం సర్పంచుల స్థానాలను కైవసం చేసుకోవాలని వ్యూహాలు పన్నుతున్నారు.





ఉట్నూర్‌లో అభివృద్ధి నిలిచిపోయింది

: బొంత ఆశారెడ్డి, మాజీ సర్పంచ్, ఉట్నూర్

2019లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగగా.. ఉట్నూర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా చేస్తూ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిలిపివేసింది. ఫలితంగా ఐదేళ్ల పాటు గ్రామ పంచాయతీకి పాలక వర్గం లేకపోవడంతో ఎక్కడికక్కడ అభివృద్ధి కార్యక్రమాలు నిలిచి పోయాయి.



ఆలస్యం చేయకుండా ఎన్నికలు నిర్వహించాలి

: జాదవ్ హరినాయక్, మాజీ సర్పంచ్, లింగోజి తండా

గ్రామాల అభివృద్ధి పంచాయతీలతోనే సాధ్యం అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి జాప్యం చేయకపోవడమే మంచిది. త్వరితగతిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బురదమయంగా మారిన ప్రాజెక్టుపైన ఉన్న రోడ్డు దుస్థితి

బురదమయంగా మత్తడివాగు రోడ్డు

తాంసి, ఆగస్టు 25: తాంసి మండలంలోని వడ్డాడి మత్తడి వాగు ప్రాజెక్టు ప్రధాన రహదారి దుస్థితి ఇది. దారి పొడవునా గుంతలు ఏర్పడి, అత్యంత ప్రమాదకరంగా మారింది. చిన్న పాటి వర్షానికే చిత్తడిగా మారి వాహనాలను అదుపు తప్పుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో చుట్టూ పరిసరాలు చూసేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.



పిల్లల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

అనాథ పిల్లలను ఆదుకుంటాం

● జిల్లా బాలల సంక్షేమ సమితి

ఇంద్రవెల్లి, ఆగస్టు 25: తల్లిని కోల్పోయిన, అనాథలైన కవల పిల్లలను అన్నివిధాలుగా ఆదుకుంటామని జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని అందునాయక్ తండా గ్రామంలో శనివారం కవల పిల్లలను జన్మనిచ్చి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారులు ఆదివారం అందునాయక్ తండా గ్రామాన్ని సందర్శించి తల్లిని కోల్పోయిన కవల పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పిల్లలను బాలల సంరక్షణ అధికారులకు అప్పగించాలని, అన్ని విధాలుగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తన భార్య దీక్ష కర్మకాండ కార్యక్రమం ఉంచి జిల్లా బాలల సంరక్షణ కేంద్రానికి అందిస్తామని, అప్పటి వరకు తమ పిల్లల బాగోగులు తామే చూసుకుంటామని బాలల సంరక్షణ సమితి అధి అధికారులకు రాత పూర్వకంగా తండ్రి గోవింద్ రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ప్రతీఒక్క చిన్నారిని ఆదుకోవడానికి బాలల సంరక్షణ కేంద్రం అధికారులు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనిల్, కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.



శిక్షకురాలు సైగాను సన్మానిస్తున్న స్థానిక ప్రతినిధులు

బాలికల స్వీయ రక్షణకు కరాటే ముఖ్యం

● స్లోవేనియా దేశస్థురాలు సైగ

తాంసి, ఆగస్టు 25: మండల కేంద్రం సమీపంలో గల ఇండోసాన్ సోగేంజి జెన్ మనిస్ట్రీ మహా ధ్యాన భూమి నందు జెన్ అకాడమీ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా స్లోవేనియా దేశానికి చెందిన ప్రఖ్యాత మాస్టర్ సైగా కరాటే -డూలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. బాలికల స్వీయ రక్షణతో బాలురకు మెళకువలు నేర్పించారు. శిక్షణలో భాగంగా ప్రతిభ కనబరిచిన అనన్య బొంసోడేకు బ్లూ బెల్ట్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సైగా మాట్లాడుతూ బాలికల స్వీయ రక్షణకు కరాటే ఎంతో ముఖ్యమన్నారు. ఇందులో జెన్ మాస్టర్ డాక్టర్ సాకు బోధిదమ్మ, లక్ష్మీకాంత్, బాబుసోనులే, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దూరవిద్యతో పైచదువులు

ఉట్నూర్, ఆగస్టు 25: ఉమ్మడి జిల్లాలోని గిరిజన యువతీ, యువకులు పైచదువుల కోసం దూర విద్య విధానంలో చదువుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్‌ల కోసం ఆసక్తి ఉన్న వారు బీఆర్ఎస్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఎ, ఎంకాం, ఎంఎస్‌సీ, బీఎల్ఐ ఎస్సీ, ఎంఎల్ఐఎస్‌సీలలో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఈ నెల 31వరకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చేసిన వారు పై చదువుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9010295910, 9666748105 లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు అన్నబాహు సాటే జయంతి

నార్నూర్, ఆగస్టు 25: గాదిగూడ మండలం కొలమా గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్నబావుసాటే 104 జయంతి ఈనెల 27న ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని మారుతి గాయక్వాడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం వద్ద సంఘం నాయకులతో కలిసి జయంతి ఉత్సవ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత హక్కుల కోసం పోరాడిన మహానీయులు జయంతికి అత్యధికంగా దళిత గిరిజన ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమ్రశంకర్, గేరే దయానంద్, నాగనాథ్, కాంబ్లి సంజురావు, సాబ్ భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు లంబాడా జేఏసీ పిలుపు

ఉట్నూర్, ఆగస్టు 25: ఈనెల 27న తలపెట్టిన ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని నిరుద్యోగులు, ఉద్యోగులు, లంబాడా జేఏసీ డిమాండ్ చేసింది. జీవో 3ను యదావిధిగా కొనసాగించాలని ప్రత్యేక ఏజెన్సీ డీఎస్‌సీని వేసి టీచర్లను వెంటనే భర్తీ చేయాలని అదే విధంగా 317 జీవోను వెంటనే రద్దు చేసి ఏజెన్సీ ప్రాంతాలలో ఏజెన్సీ ఉద్యోగస్థులను భర్తీ చేయాలని కోరడం జరుగుతుందన్నారు.

అడుగేయాలంటే.. ఆలోచించాల్సిందే!

● ఇచ్చోడ మండలంలో గ్రామసింహాల బెడద ● గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు ● భయాందోళనలో ప్రజలు





ఇచ్చోడలోని టీచర్స్‌కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు



గాయాలపాలైన చిన్నారి

ఇచ్చోడ, ఆగస్టు, 25: పల్లె పట్టణమనే తేడా లేకుండా వీధికుక్కల సంచారం ఎక్కువైంది. మండలంలో ఏ వీధి చూసినా కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. ఉదయం నడకకు వెళ్లాలన్నా.. చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలన్నా.. రాత్రి సమయంలో ఇళ్లకు రావాలన్నా.. వాటి కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరేవరకు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. చిన్నపిల్లలు ఆడుకునే సమయాల్లోనూ కొన్నిచోట్ల కుక్కలు దాడి చేసి కరుస్తున్న సంఘటనలున్నాయి. కుక్కల బెడద నియంత్రించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొనే అవకాశాలున్నాయని జనం వాపోతున్నారు.

ప్రతీ కాలనీలో ఇదే పరిస్థితి

పదుల సంఖ్యలో చేరిన ఈ కుక్కలగుంపు ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై కుక్కలున్న ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లేదుకు స్థానికులు జంకుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద మండల కేంద్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలతో పాటుగా కోతులు పందుల బెడదతోనూ ఇబ్బందులు తప్పడం లేదని పట్టణ ప్రజలు చెబుతున్నారు. వాటి బెడద నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థిపై దాడిచేసిన వీధి కుక్కలు

ఇచ్చోడ మండల కేంద్రంలోని అశోక్ నగర్ కాలనికి చెందిన చిన్నారి పాఠశాల నుంచి తిరిగి వస్తుండగా ఆరేళ్ల బాలికపై కుక్కలు దాడిచేశాయి. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. శునకాల గుంపు అదే వీధిలో నుంచి ఒక్కసారిగా చిన్నారిపై దాడిచేయడంతో చేతు, వీపునకు తీవ్ర గ్రాయాలయ్యాయి. దీంతో హుటాహుటిన ఆదిలాబాద్‌కు తరలించి మెరుగైన చికిత్సను అందజేశామని చిన్నారి పోషకులు తెలిపారు. అదే కాలనీలో గతంలో సైతం రెండు కేసులు నమోదయ్యాయి. అశోక్ నగర్, టీచర్స్ కాలనీతో పాటు ఇచ్చోడలోని అన్ని కాలనీల్లో వీధివీధిన కుక్కల బెడద అధికమైందని గ్రామస్థులు వాపోతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

బోథ్, ఆగస్టు 25: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్ల రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. యాదవులు వారి సంప్రదాయం ప్రకారం ఒక్క రోజు ముందుగానే జన్మాష్టమి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. అంతులో భాగంగానే ఆదివారం ఆయన కార్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు గొర్ల పెద్ద పోతన్న, భోజన్న, నారాయణ, రాములు, లక్ష్మణ్, నగేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న యాదవులు

● నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తాంసి: మండలంలోని పలు గ్రామాల్లో నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పొన్నారి శ్రీమురళీకృష్ణ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సోమవారం వేకువ జామున స్వామి వారికి అభిషేకాలు, సాయంత్రం నగర సంకీర్తన అనంతరం ఉట్టికొట్టి జన్మాష్టమి వేడుకలను చేపట్టనున్నట్లు సుందర సత్సంగ్ అధ్యక్షుడు మలపతి సుభాష్ తెలిపారు. మంగళవారం భజన గీతాలాపన చేసి అన్నదానం నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టామి వేడుకలకు భక్తులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

● విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు

ఉట్నూర్: మండల కేంద్రంలో మంగళవారం విశ్వ హిందూ పరిషత్ 60వ ఆవిర్భావ వేడుకలతో పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షుడు రామిని నాగన్న తెలిపారు. అలాగే మంగళవారం సాయంత్రం 4గంటలకు సతీష్ టైలర్స్ సమీపంలో ఉట్టిగొట్టే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు హాజరు కావాలన్నారు.